AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in




అయినా తీరు మారడం లేదు



2



2

కలెక్టర్ మాస్టారు..!


## ఎంఆర్‌టీ కన్‌స్ట్రక్షన్ డీఈఈగా వెంకటరమణ

**అక్షరటుడే, ఇందూరు:** టీఎస్ ఎన్‌పీడీసీఎల్‌లో ఎంఆర్‌టీ, కన్‌స్ట్రక్షన్ విభాగం పునర్వ్యవస్థీకరణ చేపట్టారు. ఇందులో భాగంగా కన్‌స్ట్రక్షన్ డివిజన్, ఎంఆర్‌టీ డివిజన్లను కలిపి ఒకే డివిజన్‌గా ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఈ విభాగానికి డీఈఈ వెంకటరమణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏడీఈలు తోట రాజశేఖర్, నటరాజ్, ఏఈలు కాశీనాథ్, దుర్గాప్రసాద్, నవీన్ రెడ్డి, మౌనిక రెడ్డి, సాయిలు, గయాస్, హైమద్, భాస్కర్, ప్రసాద్, వివిధ సెక్షన్ల సిబ్బంది, యూనియన్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



## అమిత్‌షా పర్యటన..
### కట్టుదిట్టమైన పోలీసు భద్రత

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా కేంద్రంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పర్యటన సందర్భంగా పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ సాయిచైతన్య వెల్లడించారు. కేంద్ర బలగాల సమన్వయంతో ఆక్టోపస్, గ్రేహౌండ్స్, స్నిపర్ టీంలతో పటిష్టమైన నిఘావ్యవస్థ, బైనాక్యూలర్లతో పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. దాదాపు 1300 మందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**ముమ్మరంగా తనిఖీలు..**

జిల్లా కేంద్రాన్ని పూర్తిగా పోలీసు శాఖ స్వాధీనంలోకి తీసుకుందని సీపీ వివరించారు. స్పెషల్ పార్టీ టీంలు, బీడీ టీంలు , డాగ్ స్క్వాడ్స్‌లతో బస్టాండ్ , రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాలను జల్లెడ పట్టామని సీపీ పేర్కొన్నారు. వారం రోజులుగా నగరంలో అన్ని హోటళ్లు, రెస్టారెంట్లను తనిఖీలు చేశామని పేర్కొన్నారు. నగరంలో అమిత్‌షా పర్యటించే ప్రాంతంలోని అన్ని చోట్లా ఇళ్లను సైతం పరిశీలించామని వివరించారు.



## డీఎస్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు పూర్తి

**జాతీయ పసుపు బోర్డు కార్యాలయ ప్రారంభానికి కేంద్రమంత్రి అమిత్ షా రానున్న నేపథ్యంలో జిల్లాలో విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభోత్సవం అనంతరం.. కంఠేశ్వర్ బైపాస్ వద్ద డీఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు.**

**- అక్షరటుడే, ఇందూరు**

# పసుపు రైతులకు పండుగే..

**■ నేడు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించనున్న కేంద్ర మంత్రి అమిత్ షా ■ ఇక వేగంగా కార్యకలాపాలు**

**పసుపు రైతుల దశాబ్దాల కళ నెరవేరడమే కాకుండా ఇందూరు కేంద్రంగా పసుపు బోర్డు ఏర్పాటు కావడం శుభపరిణామం. ప్రత్యేకించి నిజామాబాద్‌లోనే జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయగా.. దానిని నేడు ప్రారంభించనుండడం ఈ ప్రాంత రైతుల పాలిట వరంగా చెప్పవచ్చు. త్వరలోనే బోర్డు పూర్తిస్థాయి కార్యకాలాపాలు మొదలు కానున్నాయి. దీంతో త్వరలో పసుపు రైతులకు మంచి రోజులు రానున్నాయి. కాగా.. ఇందుకు ఎంపీ అర్వింద్ చేసిన కృషి మరువలేనిది.**

**- అక్షరటుడే, ఇందూరు**





జిల్లాలో వేల మంది రైతులు పసుపు సాగు చేస్తారు. అయితే పసుపు రైతులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడ్డారు. పసుపు బోర్డు ఏర్పాటు చేస్తేనే తమ సమస్యలు పరిష్కారం అవుతాయని భావించిన రైతులు ఏళ్లుగా పోరాటం చేశారు. ఇందులో భాగంగా 2019 పార్లమెంట్ ఎన్నికల సమయంలో నిజామాబాద్ ఎంపీ స్థానానికి పలువురు పసుపు రైతులు పోటీ చేశారు. పసుపు బోర్డు అంశంపై జాతీయ స్థాయిలో చర్చ జరగాలనే ఉద్దేశంతో 176 మంది రైతులు నామినేషన్లు వేశారు. కాగా.. ఆ ఎన్నికల్లో ఒక్కో బూత్‌లో 12 ఈవీఎంలు వాడాల్సి వచ్చింది. జిల్లాకు చెందిన 30 మంది పసుపు రైతులు ప్రధాని నరేంద్ర మోదీ పోటీ చేసిన వారణాసిలోనూ నామినేషన్లు వేశారు. ఈ అంశం అప్పట్లో చర్చనీయాంశమైంది.



### బాండ్ రాసిచ్చి.. రైతుల కల నెరవేర్చిన అర్వింద్

నిజామాబాద్ ఎంపీగా 2019లో బీజేపీ నుంచి పోటీ చేసిన ధర్మపురి అర్వింద్ తాను గెలిస్తే 100 రోజుల్లోపు పసుపు బోర్డు తీసుకొస్తానంటూ బాండ్ పేపర్ పై రాసిచ్చారు. అయితే మొదట్లో బోర్డు ఏర్పాటులో జాప్యం జరిగింది. అయినప్పటికీ అర్వింద్ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా బోర్డు ఏర్పాటు కోసం ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులను పలు పర్యాయాలు కలిశారు. ఇందూరులో పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ క్రమంలోనే నిజామాబాద్ కేంద్రంగా పసుపు బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

### 2023లో ప్రధాని మోదీ ప్రకటన


తెలంగాణలో పసుపు బోర్డు ప్రధానాంశంగా మారడంతో 2023 అక్టోబర్ 1న అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ 'పాలమూరు గర్జన'లో స్వయంగా బోర్డును ప్రకటించారు. ఆ తర్వాత కేంద్ర వాణిజ్య శాఖ దీనిపై గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ఎక్కడ ఏర్పాటు చేసేది అందులో పేర్కొనలేదు. నిజామాబాద్‌లోనే కార్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు 2025 జనవరిలో ప్రకటించింది. ఈ క్రమంలో సంక్రాంతి కానుకగా జనవరి 14న కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఎంపీ అర్వింద్‌తో కలిసి ఢిల్లీ నుంచి వర్చువల్‌గా పసుపు బోర్డు సేవలను అందుబాటులోకి తెచ్చింది.

### ఛైర్మన్‌గా 'ఇందూరు బిడ్డ' పల్లె గంగారెడ్డి

జిల్లాలో జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా బోర్డు మొదటి ఛైర్మన్‌గా జిల్లా వ్యక్తినే నియమించారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌కు చెందిన పల్లె గంగారెడ్డిని ఛైర్మన్ బాధ్యతలు అప్పగించారు. రైతు కుటుంబంలో జన్మించిన ఆయన 1991 - 93 వరకు అంకాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా 1993 - 97 వరకు బీజేపీ ఆర్మూర్ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ తర్వాత యువ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, భాజపా జిల్లా కార్యదర్శిగా రెండు పర్యాయాలు జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు.

### తెలంగాణలోనే అత్యధికం

ప్రపంచంలోనే అత్యధికంగా పసుపు భారత్‌లో సాగవుతోంది. ప్రపంచవ్యాప్తంగా సాగయ్యే పంటలో ఇది 75 శాతం. ఇక దేశంలో అత్యధికంగా తెలంగాణ, మహారాష్ట్రలోనే పసుపు పండుతుంది. రాష్ట్రంలో మన జిల్లాలోనే పసుపు ఎక్కువగా సాగు చేస్తారు. గతేడాది జిల్లా రైతులు 19 వేల ఎకరాల్లో పసుపు సాగు చేశారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 45 వేల ఎకరాల్లో సాగు చేయగా.. ఇందులో జిల్లా రైతులు 22 వేల ఎకరాల పసుపు పండించారు.



### ఎంపీ అర్వింద్ కృషి

2024 ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించాక ఇందూరులో జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు విషయంలో మహారాష్ట్ర సర్కారు అడ్డు తగిలింది. ఎక్కువ విస్తీర్ణంలో పసుపు పంట సాగయ్యే తమ రాష్ట్రంలోనే బోర్డు ఏర్పాటు చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వం, అక్కడి బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దీంతో ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్రంగా కృషి చేసి ఇందూరుకు పసుపు బోర్డు తీసుకు వచ్చారు. పసుపు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం నిజామాబాద్‌లోనే జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రుల చుట్టూ తిరిగారు. జిల్లాలో పసుపు పండే తీరును, రైతుల కష్టాలను వివరిస్తూ చివరికి బోర్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంలో విజయం సాధించారు.











## పసుపు రైతుల 30 ఏళ్ల కల నెరవేరింది



**అక్షరటుడే, ఇందూరు:** పసుపు రైతుల 30 ఏళ్ల కల నెరవేరిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కార్యక్రమ పరిశీలకురాలు బంగారు శృతి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎంపీ ధర్మపురి అర్వింద్ ఎంతో శ్రమించి పసుపు బోర్డు కార్యాలయాన్ని సాధించాడన్నారు. స్పైసిస్ బోర్డు నుంచి పసుపును వేరు చేసి ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయడంలో ఎంపీ కృషి ఎంతో ఉందని గుర్తు చేశారు.

### ఢిల్లీ వెళ్లే అవసరం లేకుండా..

దేశంలోనే ఎక్కువగా మహారాష్ట్ర , తెలంగాణలో పసుపు పండుతుందని, రైతులకు ఢిల్లీ వరకు వెళ్లే శ్రమలేకుండా నిజామాబాద్‌లో బోర్డు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కాబట్టి రైతులంతా హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రాకేష్ రెడ్డి మాట్లాడుతూ.. పసుపు బోర్డు తెలంగాణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పరిశ్రమల రాకతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎంపీ అర్వింద్ బోర్డు ఏర్పాటు చేస్తానని వాగ్దానం ఇచ్చిన తర్వాత, ప్రతిపక్షాలు అవహేళన చేశాయని అన్నారు. ప్రస్తుతం వారి కళ్లు చెదిరేలా ప్రారంభోత్సవం చేసుకుంటున్నామని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి జిల్లా నాయకులు పాల్గొన్నారు.

### మధ్యాహ్నం 2 గంటలకు అమిత్ షా రాక

పసుపు బోర్డు కేంద్ర కార్యాలయాన్ని ప్రారంభించేందుకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు రానున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి తెలిపారు. కార్యాలయ ప్రారంభం, తర్వాత రైతులతో కాసేపు ముచ్చటించి, అక్కడి నుంచి బైపాస్ చౌరస్తాలో డి.శ్రీనివాస్ విగ్రహావిష్కరణ చేస్తారని పేర్కొన్నారు. తదనంతరం పాలిటెక్నిక్ మైదానంలో ఏర్పాటు చేసిన రైతు సభకు హాజరై ప్రసంగిస్తారు. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, రఘునందన్ రావు, నగేష్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రాకేష్ రెడ్డి, పాయల్ శంకర్, రామారావు పటేల్, హరీష్ బాబు, వెంకట రమణారెడ్డితో పాటు రాష్ట్ర జాతీయ నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు.
















## బాన్సువాడ నుంచి రామప్పకు టూర్ ప్యాకేజీ

**అక్షరటుడే, బాన్సువాడ:** ప్రయాణికులకు ఆర్టీసీ సువర్ణావకాశాన్ని కల్పించింది. కుటుంబ సభ్యులు ఏదైనా పుణ్యక్షేత్రాలకు వెళ్లాల్సి వస్తే ప్రైవేటు బస్సులు, బస్ ట్రావెల్స్ ఏజెన్సీలతో మాట్లాడుకుని వాహనాలను బుక్ చేసుకుంటారు. అయితే ఈ ట్రిప్‌లకు ఖర్చు కూడా భారీగానే ఉంటుంది. ఇలాంటి వారికోసం ఆర్టీసీ యాజమాన్యం వెసులుబాటు కల్పించింది. పుణ్యక్షేత్రాలకు, విహారయాత్రలకు వెళ్లాలనుకునే వారి కోసం ప్రత్యేకంగా టూర్ ప్యాకేజీలను ప్రకటిస్తోంది.

**భద్రకాళి అమ్మవారి దర్శనం..**

బాన్సువాడ నుంచి వరంగల్ జిల్లాలోని రామప్ప, లక్నవరం, భద్రకాళి గుడి ప్యాకేజీ టూర్ ఈనెల 6న డీలక్స్ బస్సు బయలుదేరుతున్నట్లు డిపో మేనేజర్ సరిదా దేవి తెలిపారు. ఉదయం 6 గంటలకు బయలుదేరి పాలంపేటలోని రామప్ప శివుని (రామలింగేశ్వరుని) దర్శనం తర్వాత లక్నవరం సస్పెన్షన్ బ్రిడ్జి/లేక్ వ్యూ తర్వాత భద్రకాళి అమ్మవారి దర్శనం చేసుకొని రాత్రి 11 గంటలకు బాన్సువాడకు చేరుకుంటుందని తెలిపారు. టికెట్ ధర పెద్దలకు రూ. 1500, పిల్లలకు రూ. 750 ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని సూచించారు. www.tgsrtcbus.inలో (సర్వీసు నెంబర్: 96668 ) బాన్సువాడలక్నవరం అనే రూట్‌లో బుకింగ్ చేసుకోవచ్చన్నారు. లేదా టికెట్స్ బుకింగ్ కోసం గోపికృష్ణ 9063408477ను సంప్రదించాలని డీఎం పేర్కొన్నారు.

**ఇటీవల బాన్సువాడ నుంచి యాదగిరిగుట్టకు..**

ఇటీవలే బాన్సువాడ నుంచి యాదగిరిగుట్ట, స్వర్ణగిరికి డీలక్స్ బస్సు ప్యాకేజీ టూర్‌ను విజయవంతం చేశారు. ఈనెల 27న డీలక్స్ బస్సు ప్రయాణికులను తీసుకెళ్లింది. టూర్ ప్యాకేజీలు కూడా అందుబాటులో ఉండడంతో ప్రయాణికలు ఆర్టీసీ బస్సుల్లో వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు త్వరగా పూర్తి చేయాలి



**అక్షరటుడే, నిజాంసాగర్:** ఇందిరమ్మ ఇళ్లు త్వరగా పూర్తి చేయాలని పెద్ద కొడప్‌గల్ మండల ప్రత్యేక అధికారి కిషన్ పేర్కొన్నారు. మండలంలోని కాటేపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను అయన పరిశీలించారు. అనంతరం అయన మాట్లాడతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇళ్ల నిర్మాణం చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీ కాంత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఆయిల్ పాం సాగుపై అవగాహన



**అక్షరటుడే నిజాంసాగర్:** ఆయిల్ పాం సాగుపై రైతులకు మహమ్మద్ నగర్ మండల వ్యవసాయ శాఖ అధికారిణి నవ్య అవగాహన కల్పించారు. మహమ్మద్ నగర్ మండలంలోని నర్వ గ్రామంలో శనివారం రైతుల ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆయిల్ పాం సాగువల్ల రైతులకు కలిగే లాభాల గురించి వివరించారు. సమావేశంలో ఉద్యాన అధికారి సుమన్, ఏవో మధుసూదన్, ఫీల్డ్ ఆఫీసర్ హమీద్, హిందుస్థాన్ యూనిలీవర్ మేనేజర్, నాయకులు నర్సింలు, రాజేశ్వర్ గౌడ్, రాములు, సాయాగౌడ్, సాయిలు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు



**అక్షరటుడే, లింగంపేట:** ఎరువులు, విత్తన విక్రయాల కేంద్రాల్లో నకిలీ విత్తనాలు రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్ అన్నారు. శనివారం లింగంపేట మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని, ధరల పట్టికలను ఉంచాలని సూచించారు. రైతులకు అందుబాటులోను ఉంచాలని సూచించారు.

## విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్ చేయాలి



**అక్షరటుడే, లింగంపేట:** విద్యార్థుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంఈవో షౌకత్‌అలీ పేర్కొన్నారు. లింగంపేట విద్య వనరుల కేంద్రంలో శనివారం హెచ్ఎంలకు ఒక రోజు ఆన్‌లైన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యవనరుల కేంద్రం పరిధిలో ఉన్న పాఠశాలల్లో విద్యార్థుల వివరాలు యూడైస్ ప్లస్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ఆ వివరాల ప్రకారమే.. విద్యార్థులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, వర్క్‌బుక్స్ మధ్యాహ్న భోజనం బిల్స్, పాఠశాల నిధులు, ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ జరుగుతుందని వివరించారు. కార్యక్రమలో ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది ఎంఐయస్‌కో, ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.




# అయినా తీరు మారడం లేదు..

**▪ ఆర్టీఏ చెక్‌పోస్టుల్లో ఏసీబీ సోదాలు ▪ ఏడాదిలో రెండు సార్లు తనిఖీలు**

**రాష్ట్రంలోని రవాణా శాఖ చెక్‌పోస్టుల్లో ఏసీబీ దాడులు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని సలాబత్‌పూర్ చెక్‌పోస్టులో సోదాలు చేసింది. ఈ సమయంలో రూ. 91వేలు లెక్క చూపిన నగదు దొరికినట్లు ఏసీబీ తెలిపింది. కాగా.. ఒక్క రోజులోనే అక్రమంగా రూ. లక్షల నగదు వసూలు చేస్తుండడంతో చెక్‌పోస్టుల్లో ఈ స్థాయిలో అవినీతి జరుగుతుందా అనే చర్చ జరుగుతోంది. ఈ చెక్‌పోస్టులో ఆరునెలల్లో రెండు సార్లు సోదాలు జరిగినా తీరు మారకపోవడం గమనార్హం.**

**- అక్షరటుడే, నిజామాబాద్**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రెండు ఆర్టీఏ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఉన్నాయి. అలాగే మరో రెండు అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఉన్నాయి. వీటిలో ఎంవీఐలతో పాటు సిబ్బంది వాహనాలు తనిఖీలు చేస్తుంటారు. నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధిస్తారు. కానీ అనేక మంది వాహన దారులు నిబంధనలు పాటించకుండా, సరైన పత్రాలు లేకుండానే సరుకు రవాణాలు చేస్తుంటారు. దీనిని సాకుగా చూపి చెక్‌పోస్టుల సిబ్బంది ఒక్కో వాహనానికి రేటు ఫిక్స్ చేసి మరీ వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం ప్రైవేటు సిబ్బందిని నియమించి వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**ఆరునెలల్లో రెండు సార్లు..**

కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం సలబత్‌పూర్ ఆర్‌టీఏ చెక్‌పోస్టులో రెండు రోజుల క్రితం ఏసీబీ అధికారులు తనిఖీలు చేశారు. ఏసీబీ డీఎస్పీ శేఖర్ ఆధ్వర్యంలో చెక్‌పోస్టులో సోదాలు చేశారు. ఆ సమయంలో విధుల్లో ఓ ఏఎంవీఐ పాటు సిబ్బంది, ఇద్దరు ప్రైవేట్ వ్యక్తులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరి వద్ద నుంచి లెక్కకు రాని రూ. 91వేల నగదును స్వాధీనం చేస్తున్నారు. ఇందుకు సంబం ధించిన నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. కాగా.. ఈ చెక్‌పోస్ట్‌లో ఏసీబీ అధికారులు గతంలోనూ దాడులు చేశారు. ఆరు నెలల్లో రెండు సార్లు సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే చెక్‌పోస్ట్ సిబ్బంది తనిఖీల పేరిట వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

**చేతులు తడపాల్సిందే..**

ఉమ్మడి జిల్లాలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల సిబ్బందిపై అనేక ఆరోపణ లున్నాయి. గతంలో సైతం తనిఖీల సమయంలో డబ్బు దొరికినా చర్యలు చేపట్టలేదు. దీంతో చెక్‌పోస్ట్ సిబ్బంది భయం లేకుండా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. అయినా రవాణా శాఖ అధికారులు మాత్రం తీరు మార్చుకోవట్లేదు. ఈ క్రమంలోనే ఏసీబీ అధికారులు చెక్‌పోస్టులపై దృష్టి సారించినట్లు సమాచారం.

## కాలభైరవాలయంలో టీపీసీసీ జనరల్ సెక్రెటరీ పూజలు



**అక్షరటుడే, కామారెడ్డి:** రామారెడ్డి మండలంలోని ఇసన్నపల్లిలో గల కాలభైరవ స్వామి ఆలయంలో జహీరాబాద్ ఎంపీ కూతురు గిరిజ షెట్కార్ ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవల ఆమె టీపీసీసీ జనరల్ సెక్రెటరీగా నియమితులయ్యారు. దీంతో శనివారం ఆలయానికి వచ్చిన ఆమె ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అంతకుముందు ఆమెకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## కలెక్టర్ మాస్టారు..!




అక్షరటుడే, కామారెడ్డి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కాసేపు లెక్కల మాస్టారుగా మారారు. శనివారం కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం కాసేపు విద్యార్థులకు లెక్కల పాఠాలు బోధించారు. అలాగే, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, సీజనల్ వ్యాధుల నేపథ్యంలో పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సూచించారు.

## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కుటుంబం



**అక్షరటుడే నిజాంసాగర్:** జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు కుటుంబసభ్యులు శనివారం సీఎం రేవంత్ రెడ్డిని మార్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో వారు ఆయనను కలుసుకున్నారు. తోట లక్ష్మీకాంతా రావు కుమార్తె తోట జసింత లండన్ స్కూల్ ఇఫ్ ఎకనామిక్స్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన సందర్భంగా వారు సీఎంను కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి జసింతను అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలి




**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణ ప్రజలు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మున్సిపల్ కమిషనర్ రాజు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా శనివారం పట్టణంలోని 25, 36 వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఇంటింటికీ తిరుగుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడవద్దని ప్రజలకు వివరించారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు వహించాలని సూచించారు. వీధికుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలని.. చిన్నారులను ఒంటరిగా బయటకు పంపవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, వార్డ్ ఆఫీసర్లు జయలక్ష్మి, సింధూజ, సానిటరీ జవాన్లు నరసయ్య, గోపి, మెప్మా ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా ఇసుక అక్రమ రవాణా

**అక్షరటుడే, కోటగిరి:** మంజీర వాగును అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. రాత్రిపగలు తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. పోతంగల్ మండలంలోని మంజీరా వాగు నుంచి ట్రాక్టర్లలో ప్రతిరోజు మహారాష్ట్ర తోపాటు ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డుకోవాల్సిన పోలీసు, రెవెన్యూ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

మంజీర పరివాహక ప్రాంతాలైన సుంకిని, కారేగాం, కొడిచెర్ల, పోతంగల్ శివారు నుంచి నిత్యం ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల పేరిట పర్మిషన్ ఇస్తున్నా.. రాత్రి వేళల్లో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. ట్రాక్టర్లలో తరలిస్తూ రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు విక్రయించుకుంటున్నారు. ఫలితంగా అక్రమార్కుల జేబులు నిండుతుండగా, ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోంది.

**అధికారుల పర్యవేక్షణ కరువు..**

మంజీరా పరివాహక ప్రాంతం నుంచి తరలించిన ఇసుకను గ్రామ శివారులో నిల్వ చేస్తున్నారు. రాత్రి వేళల్లో పట్టణ ప్రాంతాలకు టిప్పర్లలో తరలిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా విషయమై తహసీల్దార్ గంగాధర్‌ను వివరణ కోరగా.. నిఘా పెంచుతామని, అక్రమ ఇసుక డంపులను స్వాధీనం చేసుకుంటామని, ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

## రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నిజామాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. రైల్వే ఎస్సై సాయారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ స్టేషన్ మేనేజర్ చందన్ కుమార్ ఇచ్చిన సమాచారం మేరకు శనివారం ఉదయం రైల్వేస్టేషన్ సమీపంలో మృతదేహాన్ని కనుగొన్నారు. అతడిని ఎల్లమ్మగుట్టకు చెందిన జాదవ్ శివ తేజ (19)గా గుర్తించారు. రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డట్లుగా గుర్తించి మృతదేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు రైల్వే ఎస్సై తెలిపారు. ఆత్మహత్యకు గల వివరాలు తెలియాల్సి ఉంది.

## గాంధారిలో ఎలుగుబంటి కలకలం

అక్షరటుడే గాంధారి: గాంధారి మండలంలో ఎలుగుబంటి సంచారం కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళ్తే.. గాంధారి మండలంలోని చద్మల్ తండా శివారులోని అడవిలో ఎలుగుబంటి కనిపించిందని గ్రామస్థులు పేర్కొన్నారు. గాంధారి నుంచి నిజామాబాద్‌కు మంచిప్ప మీదుగా వెళ్లే మార్గంలో దట్టమైన అటవీప్రాంతం ఉంది. ఈ ప్రాంతంలో తరచూ ఎలుగుబంట్ల జాడలు కనిపిస్తాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. తాజాగా చద్మల్‌తండా శివారులో ఎలుగుబంటి కనిపించడంతో కొందరు బైక్‌పై వెళ్లే వ్యక్తులు వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. ఆ మార్గం నుంచి ఎలుగుబంట్లు బయటకు రాకుండా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఎలుగబంటి సంచారిస్తుందని సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్ కావడంతో చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**గతంలోనూ ఎలుగుబంటి ఆనవాళ్లు..**

అయితే చద్మల్‌తండా శివారులోని అడవిలో కొన్నేళ్ల క్రితం ఎలుగుబంటి ఆనవాళ్లు కనిపించాయని గ్రామస్థులు పేర్కొన్నారు. తునికాకు కోసేందుకు కొంతమంది అడవుల్లోకి వెళ్లగా ఎలుగుబంట్లను చూసి వారు వెనక్కి వచ్చిన సందర్భాలున్నాయి.

